భద్రతతో భరోసా కల్పించాలి



కోల్‌కత్తాలో వైద్యురాలిపై అత్యాచారం, హత్య సంఘటనలు భవిష్యత్‌లో జరగకుండా ఉండేందుకు దేశ వ్యాప్తంగా భద్రతా చర్యలు తీసుకోవాలి. గ్రామీణ ప్రాంతాల్లోని పీహెచ్‌సీల్లో నైట్ డ్యూటీలు చేస్తే వైద్య సిబ్బందికి రక్షణగా ఒక కానిస్టేబుల్‌తో భద్రత కల్పించాలన్నారు.

కె.సౌజన్యకుమారి, స్టాఫ్ నర్స్, నందిమండలం, పీహెచ్‌సీ, పెండ్లిమర్రి.

భద్రత ప్రభుత్వాలపైనే ఉంది



పట్టణాల్లో, గ్రామీణ ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తున్న మహిళలకు భద్రతా పరంగా స్పష్టమైన భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. ఈ విషయంలో ప్రభుత్వాలే కాకుండా ఆయా గ్రామాలు, పట్టణాల ప్రజలు కూడా మహిళల పట్ల రక్షణ బాధ్యత కలిగి ఉండాలి. అప్పుడే మహిళలు ఎక్కడైనా తమ ఉద్యోగాలు సక్రమంగా నిర్వహిస్తారు. దీనిపై ప్రభుత్వం ప్రజలకు అవగాహన కల్పించాలి.

– అరుణ్ కుమార్, ఎస్ఎన్, చక్రాయపేట



ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టిపెట్టాలి



మహిళలపై జరుగుతన్న దాడులపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి పెట్టాలి. దాడులకు పాల్పడుతున్న వారిపై పోలీసులు కఠినమైన కేసులు నమోదు చేయాలి. నేరస్తులకు రాజకీయ నాయకులు అండగా ఉండకుండా వారిని శిక్షించేందుకు సహకరించాలి. కలకత్తాలో మహిళా డాక్టర్‌పై జరిగినటువంటి సంఘటన దేశంలో ఏ మహిళపై జరగకుండా ఉండే విదంగా రక్షణ కల్పించాలి. ప్రత్యేకంగా చట్టాలు తీసుకురావడంతో పాటు వాటిని వెంటనే అమలు చేసే విదంగా నిర్ణయం తీసుకోవాలి. – టి. అనిత, ఏఎన్ఎం, వీరపునాయునిపల్లె

చట్టాలు కఠినంగా ఉండాలి



మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడే వారిపై మరింత కఠినంగా చట్టాలు చేయాలి. వైద్యులు ఆసుపత్రికి వచ్చే వారికి తమ ప్రాణాలు సైతం లెక్క చేయకుండా వైద్యం అందిస్తుంటారు. అయితే కొంత మంది డాక్టర్లపై, సిబ్బందిపై దాడులు చేస్తుంటారు. అటువంటివారిపై కఠినమైన శిక్షలు ఉండాలి. రాత్రిపూట విధులు నిర్వహించే మహిళా డాక్టర్లు, సిబ్బంది కోసం రక్షణ చర్యలు చేపట్టాలి.

– శిల్పా, ప్రభుత్వ వైద్యురాలు, జమ్మలమడుగు

క్లుప్తంగా

31న ఫించన్లు పంపిణీ

పులివెందుల టౌన్ : ఆగస్టు 31వ తేదీనే ఫించన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు వృద్ధాప్య, వితంతు, కల్లుగీత, చేనేత కార్మికులు, ఒంటరి మహిళ, చర్మకళాకారులు, హిజ్రాలు, డప్పు కళాకారుల ఫించన్ల పంపిణీ సెప్టెంబర్ 1 ఆదివారం కావడంతో ఆగస్టు 31వ తేదీ శనివారం ఉదయం 6 గంటల నుంచి సచివాలయ సిబ్బంది ద్వారా నేరుగా ఇంటి వద్దకే వచ్చి పంపిణీ చేస్తారన్నారు.

సింహాద్రిపురం : సెప్టెంబర్ 1వ తేదీ ఆదివారం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం పింఛన్‌దారులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఆగస్టు 31వ తేదీనే పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. పింఛన్‌దారులు శనివారం అందుబాటులో ఉండి తీసుకోవాలని ఆయన తెలిపారు.

ఘనంగా గ్రామోత్సవం



ఉప్పలూరులో గ్రామోత్సవ వేడుకలు

ముద్దనూరు : మండలంలోని ఉప్పలూరు గ్రామంలో శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా గురువారం గ్రామోత్సవం నిర్వహించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఉప్పలూరులో ఘనంగా శ్రీకృష్ణ జయంతి వేడుకలను నిర్వహించారు. సాయంత్రం గ్రామంలో శ్రీకృష్ణ ప్రతిమతో గ్రామోత్సవం ఘనంగా జరిగింది.

రైఫిల్ షూటింగ్‌పై శిక్షణ



శిక్షణను ప్రారంభిస్తున్న విద్యా కమిటీ చైర్మన్

వల్లూరు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మొట్ట మొదటి సారిగా రైఫిల్ షూటింగ్ శిక్షణను ప్రారంభించారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు తిరుపాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లోని నైపుణ్యాలను గుర్తించి పాఠశాలలో పలు క్రీడాంశాలలో శిక్షణ ఇస్తున్నామన్నారు. విద్యార్థులకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

పులివెందుల రూరల్ : పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల వద్ద సీఐ, ఎస్ఐ ఆదేశాల మేరకు పోలీసులు గస్తీ నిర్వహిస్తున్నారు. మూడు రోజుల నుంచి కళాశాలలు, పాఠశాలల వద్ద కొంతమంది ఆకతాయిలు విద్యార్థులను హేళనగా మాట్లాడుతూ ర్యాగింగులకు పాల్పడుతున్నారని సమాచారం రావడంతో ముందు జాగ్రత్తగా పోలీసులు కళాశాలలు వదిలే సమయంలో, ప్రారంభం సమయంలో పోలీసులు గస్తీ నిర్వహిస్తున్నారు. ఆకతాయిలు మూడు రోజుల క్రితం ముద్దనూరు రోడ్డులో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్దకు వెళ్లి అమ్మాయిలను ర్యాగింగ్ చేస్తూ విద్యార్థులను భయాందోళనకు గురిచేశారు. ఈ విషయంపై కళాశాల యాజమాన్యం కూడా పోలీసుల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో కళాశాలలు, పాఠశాలల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసు సిబ్బందిచే గస్తీ నిర్వహిస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఎస్‌పీఎఫ్ శాఖలో పోలీస్ యూనిఫారం మార్పు



మార్చిన యూనిఫారం ఎస్‌పీఎఫ్ సిబ్బందికి అందిస్తున్న ఆర్టీపీపీ సీఈ గౌరీపతి

ఎర్రగుంట్ల : ఆంధ్ర ప్రదేశ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ప్రతిపాదించిన వివిధ పోలీస్ శాఖలలో యూనిఫాం మార్చారు. నూతన యూనిఫాంను ఆర్టీపీపీ సీఈ గౌరీపతి ఎస్‌పీఎఫ్ సిబ్బందికి గురువారం అందజేశారు. నూతనంగా ప్రతిపాదించిన మేరకు ఎస్‌పీఎఫ్ సిబ్బందికి పింగ్ క్యాప్, బ్లాక్ బెల్ట్ ఎస్‌పీఎఫ్ లోగో మార్పు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పీఎఫ్ కమాండ్ డీఎస్‌పి బాషా, అసిస్టెంట్ కమాండెంట్ జయచంద్ర, ఫ్యాక్టరీ మేనేజర్ సిద్ధయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా తెలుగుభాషా, జాతీయ క్రీడా దినోత్సవాలు



కమలాపురంలో గిడుగు చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



పులివెందులలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తదితరులు



జమ్మలమడుగులో ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

వివిధ పట్టణ, గ్రామాలలో తెలుగుభాషా, జాతీయ క్రీడా దినోత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు.

కమలాపురం : తెలుగు భాషోద్యమానికి స్ఫూర్తి ప్రదాత గిడుగు రామ్మూర్తి అని, మాతృభాష మన సంస్కృతీ, సాంప్రదాయాలకు పట్టుకొమ్మ అని పెద్దచెప్పలి జడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఓబుల్‌రెడ్డి తెలిపారు. గురువారం తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని గిడుగు రామమూర్తి, ధ్యాన్ చంద్ చిత్ర పటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి చోట తెలుగు వెన్నెలై వెలగాలని, సిరి నవ్వులై కురవాలని, మనోహరంగా వికసించాలన్నారు. పద్యం, చందస్సు, అవధానం, సామెతలు, జాతీయాలు తెలుగు భాషకు మాత్రమే సొంతమన్నారు. గిడుగు రామ్మూర్తి జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డీకే చదువుల బాబు మాట్లాడుతూ మన తెలుగు సాహితీ సంపదను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. తెలుగు భాషను ప్రతి ఒక్కరూ ఆదరించాలన్నారు. కార్యక్రమంలో తెలుగు భాషోపాధ్యాయులు రాజశేఖర్‌రెడ్డి, పీడీలు ఎల్.అబ్రహం, ఎల్‌పి సునీల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పులివెందులలో..

పులివెందుల టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, ఇస్లాంపురం హైస్కూల్‌లో తెలుగు భాష దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మాతృభాషపై మమకారం పెంచుకోవాలన్నారు. అనంతరం తెలుగు అధ్యాపకులను సన్మానించారు. అలాగే ఇస్లాంపురం హైస్కూల్‌లో హెచ్ఎం బండి సుధాకర్‌రెడ్డి తెలుగు భాష దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం యొక్క ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. గిడుగు రామ్మూర్తి చిత్ర పటానికి నివాళులర్పించారు. విద్యార్థులు తెలుగు భాషతో పాటు క్రీడలపై కూడా ఆసక్తి పెంచుకుని రాణించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుధీర, తెలుగు హెచ్‌ఓడీ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : మండల వ్యాప్తంగా తెలుగుభాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల, శ్రీ చైతన్య ఉన్నత పాఠశాల, ఉషాకిరణ్ ఉన్నత పాఠశాల, నారాయణ ఇంగ్లీష్ మీడియం హైస్కూళ్లలో ఆయా పాఠశాలల కరస్పాండెంట్ల ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి తెలుగు భాషకు చేసిన సేవలను కొనియాడారు. ఒలంపిక్ హాకీ క్రీడల్లో పాల్గొని 133 గోల్స్ సాధించి మూడుసార్లు హాకీ కప్ (స్వర్ణపతకాలు) సాధించిన ధ్యాన్‌చంద్ సేవలను గుర్తించి ఆయన పుట్టినరోజును జాతీయ క్రీడా దినోత్సవంగా నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్లు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు భాసా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర, బాలికోన్నతపాఠశాలల్లో గిడుగు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగుభాషా ప్రాముఖ్యాన్ని గూర్చి ఉపాధ్యాయుల వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజబాబు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : అంకాలమ్మ గూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గిడుగు రామమూర్తి జయంతి సందర్భంగా మాతృభాషా దినోత్సవాన్ని జరుపుకున్నారు. విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి ప్రధానోపాధ్యాయులు భాస్కర్ వారికి బహుమతులు ప్రధానం చేశారు. ఉపాధ్యాయులు తెలుగు ఉపాధ్యాయుడు శ్రీరంగనాథంను ఘనంగా సత్కరించారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ధ్యాన్‌చంద్ చిత్ర పటానికి డీవైఎఫ్ఐ పట్టణ సహాయ కార్యదర్శి మహేష్ యాదవ్ ఘనంగా నివాళులర్పించారు. అలాగే తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా గూడెంచెరువు ప్రాథమికోన్నత పాఠశాలలో ఎంఈఓ చంద్రశేఖర్‌రావు గిడుగు రామమూర్తి, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే స్థానిక సాంఘిక సంక్షేమ పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు గురు చంద్ర మోహన్ గిడుగు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

వల్లూరులో..

వల్లూరు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మాతృభాషా దినోత్సవ, జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన ఈ వేడుకల్లో గిడుగు వేంకట రామమూర్తి, ప్రముఖ హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్ చంద్ చిత్ర పటాలకు నివాళులు అర్పించారు. అనంతరం క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందచేశారు. విద్యా ర్థులు చేసిన నాట్యం అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఎంఈవోలు లిల్లెమ్మ, విజ యారెడ్డి, ఉపాధ్యాయులు శ్యామసుందర్, తిరుపాల్‌రెడ్డి, పాఠశాల విద్యా కమిటీ చైర్మెన్ మోహన్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

కమలాపురం సీఐగా రోషన్



కమలాపురం : స్థానిక సీఐగా ఎస్‌కే రోషన్ గురవారం బాధ్యతలు చేపట్టారు. అనంతపురం జిల్లా గుత్తి యాడికి సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా పనిచేస్తూ కమలాపురం సీఐగా బదిలీపై వచ్చారు. ఈయన జిల్లాలోని వీఎన్ పల్లె, చెన్నూరు, కడప టూ టౌన్, సింహాద్రిపురం తదితర పోలీస్ స్టేషన్లలో ఎస్ఐగా సేవలు అందించారు. బాధ్యతలు చేపట్టిన ఆయన సర్కిల్ పరిధిలోని పోలీస్‌స్టేషన్లలో అందుబాటులో ఉంటూ అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు శాయశక్తుల కృషి చేస్తానన్నారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరిగితే ప్రజలు 100 లేదా 91211 00529 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

రైతుసేవా కేంద్రాలు తనిఖీ

కొండాపురం : మండలంలోని టి.కోడూరు, యర్రగుడి, ఎస్.కొత్తపల్లె రైతుసేవా కేంద్రాలలో ఎరువులను మండల వ్యవసాయ అధికారి ఏవీ రామాంజులరెడ్డి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రైతులకు యూరియా కొరతలేకుండా చూడాలన్నారు. ఎరువుల రికార్డులను తనిఖీ చేశారు. అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఇ–క్రాఫ్ పంట నమోదు క్షేత్ర స్థాయిలో పారదర్శకంగా చేయాలన్నారు. నేడు శుక్రవారం బురుజుపల్లె రైతు సేవా కేంద్రంలో అటవీ ఆధికారులచే సమీక్ష సమావేశం నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో ఎఈఓ రమేష్, తదితరులు పాల్గొన్నారు

ట్రిపుల్‌ఐటీలో డ్రగ్స్ నిషేధంపై అవగాహన

వేంపల్లె : ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటీలో డ్రగ్స్ నిషేధంపై విద్యార్థులకు జాతీయ సేవా సమితి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించినట్లు డైరెక్టర్ కుమారస్వామి గుప్తా తెలిపారు. విద్యార్థులకు డ్రగ్స్ వాడకంపై వారి జీవితాలలో ఎంత నష్టం వాటిల్లుతుందో జీవనశైలి ఎంత దెబ్బ తింటుందో వివరించారు. విద్యార్థి దశలో తప్పు చేస్తే దాని యొక్క పరిణామం విద్యార్థులపై వారి తల్లిదండ్రులపై ఉంటుందన్నారు.

అలాగే ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు విశ్వనాథరెడ్డి, రెడ్డి, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ మధుసూదనలు పాల్గొని విద్యార్థులకు డ్రగ్స్ నిషేధం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. డైరెక్టర్ చెప్పిన సూచనలు తప్పకుండా పాటించాలని విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డైరెక్టర్ కుమారస్వామి గుప్తా

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కమలాపురం : వర్షా కాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ హోమియో వైద్యాధికారి షాకీర్‌హుసేన్ తెలిపారు. పట్టణంలోని మారుతి నగర్‌లో గురువారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. ఇటీవల పలు ప్రాంతాల్లో డెంగీ వ్యాధి విజృంభిస్తుండటంతో ముందస్తు జాగ్రత్తగా వైద్య శిబిరం నిర్వహించార. 65 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఆర్సెనిక్ ఆల్బమ్–200 మందును తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వ్యాధులకు హోమియోలో అద్భుత చికిత్సలు ఉన్నాయన్నారు. అలాగే ఈ మందులు వినియోగిస్తే సైడ్ ఎఫెక్ట్స్ రావన్నారు. దీర్ఘకాలిక వ్యాధులైన మోకాళ్ల నొప్పులు, నడుము నొప్పులు, కిడ్నీలో రాళ్లు, అలర్జీ, జలుబు, దగ్గు, సానికా పాలిప్స్, అడినాయిడ్స్, మొటిమలు, ఆనేలు, పులిపిరులు, గ్యాస్ట్రిక్ సమస్య, చికెన్ గున్యా, పీసీఓడీ, తెల్ల మైల, రుతు సమస్యలు తదితర వాటికి హోమియోలో అద్భుత చికిత్సలు ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరూ కమలాపురంలోని హోమియో వైద్య శాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి మంగళ, గురు, శని వారాలలో అందుబాటులో ఉంటానని, ఎలాంటి రోగాలకైనా చికిత్సలు ఉన్నాయన్నారు.



చిన్నారులకు హోమియో మందులు తినిపిస్తున్న వైద్యులు షాకీర్ హుసేన్

దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలి

వేముల : దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య అన్నారు. గురువారం వేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పెర్నపాడులో ఇంటింటా ఫీవర్ సర్వే, లార్వా సర్వే నిర్వహించి నిల్వఉన్న నీటిలో అబేట్ పిచికారీ చేసి, ప్రజలకు మలేరియా, డెంగీ వ్యాధులపై అవగాహన కల్పించినట్లు ఆయన తెలిపారు. ఆరోగ్య కార్యకర్తలు ప్రతి గ్రామాన్ని సందర్శించి జ్వరం ఉన్న వారికి రక్తపూతలు సేకరించి వారానికి మూడు సార్లు ల్యాబ్‌కు అందజేయాలన్నారు. ఎవరికైనా మలేరియా నిర్ధారణ అయితే వెంటనే చికిత్స అందించాలని, మలేరియా వచ్చిన వ్యక్తి గ్రామంలో ఫీవర్ సర్వే, లార్వా సర్వే చేసి గ్రామంలో ప్రజలందరికీ రక్తపరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు రమణమ్మ, శ్రీనివాసులు పాల్గొన్నారు.



ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న సిద్ధయ్య

పేకాట స్థావరంపై దాడులు

వేంపల్లె : స్థానిక పాపాఘ్ని నది ఒడ్డున వేంపల్లె–అలిరెడ్డిపల్లె రోడ్డు మార్గంలోని చీనీతోటల్లో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించినట్లు వేంపల్లె సీఐ సురేష్‌రెడ్డి వెల్లడించారు. గురువారం తన సిబ్బందితో పేకాట ఆడుతున్న వారిపై దాడులు చేశామని, వారి నుంచి రూ.15వేలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

అధికారి మారినా.. పేరు మారలేదు

పులివెందుల రూరల్ : పట్టణంలోని మండల సభా భవనంలో ఎంపీడీఓగా పనిచేస్తున్న పి.దివాకర్ బదిలీపై వెళ్లి 30 రోజులు అవుతున్నప్పటికీ కార్యాలయానికి ఉన్న బోర్డుకు మాత్రం ఆయన పేరు అలాగే ఉంచారు. ఆయన స్థానంలో ఎంపీడీఓగా వెంకటేష్ బాధ్యతలు చేపట్టి 30 రోజులు అవుతున్నా బోర్డులో మాత్రం పేరు మార్చలేదు. దీనిని బట్టి అధికారుల పనితీరు ఎలా ఉందో అర్థమవుతోంది.



బోర్డులో మారని పేరు

ఘనంగా కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

వల్లూరు (చెన్నూరు) : స్థానిక ట్రంకురోడ్డులోని శివాలయంలో గురువారం శ్రీ లలితాంబికా సమేత నాగేశ్వరస్వామి కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమంలో 5000 మంది భక్తులు పాల్గొన్నారు. అనంతరం ధ్వజస్తంభ ప్రతిష్ట, అలాగే కలశ ప్రతిష్ట వైభవంగా నిర్వహించారు. భక్తులకు చలవ పందిళ్లు ఏర్పాటు చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ పురుషోత్తం రాజు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సత్తా చాటిన విద్యార్థులు

తొండూరు : తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా జిల్లాస్థాయిలో జరిగిన పోటీలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అగడూర్ గ్రామానికి చెందిన అపూర్వ పద్యపఠన విభాగంలో ద్వితీయ స్థానం, వక్తృత్వ పోటీలలో గంగా శ్రీవిద్య తృతీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా తొలి తెలుగు శాసనం వెలసిన ఎర్రగుంట్ల మండలం కలమల్ల గ్రామంలో జరిగిన మాతృభాష దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, జిల్లా కలెక్టర్ శివశంకర్‌ల చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాబురెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

పంట నమోదు తప్పని సరి

పెండ్లిమర్రి : పంట సాగు చేసిన ప్రతి రైతు పంట నమోదు తప్పనిసరిగా చేయించాలని జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు తెలిపారు. గురువారం మండలంలోని మిట్టమీదపల్లె గ్రామ పొలాల్లో సాగు చేసిన పత్తి, సజ్జ పంటలను ఆయన పరిశీలించి మాట్లాడారు. పంటల సాగలో రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చునన్నారు. పంటల సాగులో తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఓ ఓబులేసు, రైతు శిక్షణ కేంద్రం ఏఓ నాగభూషన్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకురాలు నాగలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

లింగాల : మండలంలోని వెలిదండ్ల సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ బాలసంజీవులు ఒక ప్రకటనలో తెలిపారు. వెలిదండ్ల సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ వెలిదండ్ల ఫీడర్ పరిధిలో రోడ్డు క్రాసింగ్ పోల్స్ మార్చుతున్న కారణంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్రజలు, రైతులు సహకరించాలన్నారు.

పొలంబడితో అవగాహన

ఎర్రగుంట్ల : చిన్నదండ్లూరు గ్రామ పరిధిలోని వరి పొలంలో పోలంబడి కార్యక్రమాన్ని గురువారం కమలాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు నరసింహారెడ్డి నిర్వహించి మాట్లాడారు. రైతులు పంట పోలాలపై నిరంతరం నిఘా పెట్టడం వలన సత్ఫలితాలను పొందవచ్చన్నారు. రైతు సరైన నిర్ణయాలను తీసుకునే విధంగా తీర్చిదిద్దడమే పోలంబడి ముఖ్య ఉద్దేశ్యమన్నారు. మండల వ్యవసాయ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు

మైనింగ్ మాఫియా ఆగడాలను అరికట్టాలి

జమ్మలమడుగు : వివిధ ప్రాంతాలలో ఇసుక, మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని సీపీఎం నాయకుడు ఏసుదాసు తెలిపారు. గురువారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాఫియా ప్రతిరోజు ఇసుక, ఎర్రమట్టి, గ్రావెల్‌ను వందల ట్రాక్టర్‌లతో తరలిస్తున్నా అధికారులు, ప్రభుత్వ ప్రతినిధులు ఏమాత్రం పట్టించుకోవడంలేదన్నారు. కరువు ప్రాంతంగా ఉన్న జమ్మలమడుగు నియోజకవర్గంలో అక్రమ మైనింగ్‌లు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. అధికారులు వెంటనే మైనింగ్ మాఫియాకు అడ్డుకట్టవేయాలన్నారు.

లీకేజీలను అరికట్టాలి

జమ్మలమడుగు : పట్టణంలోని పలు ప్రాంతాలలో పైప్‌లైన్ పగిలి ప్రజలకు సరఫరా అయ్యే తాగునీరు కలుషితమై వస్తుందని కాంగ్రెస్ నాయకుడు పాముల బ్రహ్మానందరెడ్డి ఈ సందర్భంగా గురువారం మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. మార్కెట్ రహదారిలో నెలరోజుల నుంచి పైప్‌లైన్ పగిలి నీరు నిరుపయోగంగా పోతుందన్నారు. రాత్రి పూట చాలా ప్రాంతాలలో వీధి దీపాలు వెలుగడంలేదని అధికారులు చర్యలు చేపట్టాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

కొండాపురం : తాళ్ల ప్రొద్దుటూరు సమీపంలో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనడంతో బింగి చిన్న నరసింహులు తలకు గాయమైంది. తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ హృషికేశవరెడ్డి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బాధితుడిని తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.